

పరకాల : నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు



వర్ధన్నపేట : అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

# కాంగ్రెస్ నిర్ణయంతో రోడ్డున పడ్డాం

- సర్కారు ఆటో డ్రైవర్ల పొట్ట కొట్టడం అన్యాయం
- 'మహాలక్ష్మి' పథకం వల్ల మహిళలు ఆటో ఎక్కడం లేదు
- ఫైనాన్స్ కట్టడానికే ఇబ్బంది పడుతున్నాం
- ఇక కుటుంబాలను ఎలా పోషించుకోవాలి
- ప్రభుత్వ నిర్ణయంపై ఆటో డ్రైవర్ల ఆగ్రహం
- పరకాల, కమలాపూర్, వర్ధన్నపేటలో నిరసనలు, ధర్నాలు

పరకాల, డిసెంబర్ 16 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, హామీలతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంపై ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాదిమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ స్వయం ఉపాధి పొందుతున్న ఆటో డ్రైవర్లను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం 'మహాలక్ష్మి' పేరుతో మహిళలందరికీ ఉచిత ప్రయాణం కల్పించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తాము ఉపాధి కోల్పోయామని ఆవేదన చెందారు. తమ కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని, లేని పక్షంలో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### కమలాపూర్‌లో నిరసన..

కమలాపూర్ : కాంగ్రెస్ సర్కారు నిర్ణయంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల తాము జీవనోపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దంతా ఆటో నడిపినా కుటుంబం గడిచే పరిస్థితి లేదన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల ఎవరూ ఆటో ఎక్కడం లేదని వాపోయారు. దీంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందన్నారు. అనంతరం పరకాల-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టి, ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు సత్యనారాయణరావు, ఆటో డ్రైవర్లు రవి, కుమారస్వామి, రాజు పాల్గొన్నారు.

### ఉపాధి కోల్పోతున్నాం..

వర్ధన్నపేట: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోతున్నామని ఆటో డ్రైవర్లు అన్నారు. ఈ మేరకు వర్ధన్నపేట పట్టణంలో ఆందోళన చేశారు. ఆటో యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేసి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల మహిళా ప్రయాణికులు ఆటోల్లో ఎక్కడం లేదన్నారు. దీంతో ఫైనాన్స్‌లో రుణాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఫైనాన్స్ కంపెనీలు ఆటోలను తీసుకెళ్తే డ్రైవర్లు రెండు విధాలుగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పరిస్థితిని అర్థం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఆందోళనలో ఆటో డ్రైవర్స్ యూనియన్ మండల బాధ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క పర్యటన ఖరారు

- నేడు మేడారం మహా జాతర పనులపై సమీక్ష
- రేపు రామప్ప సందర్శన.. దివ్యాంగులకు పరికరాల పంపిణీ

ములుగు, డిసెంబర్ 16 (నమస్తేతెలంగాణ) : పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆది, సోమవారాల్లో ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి ములుగు నియోజకవర్గంలో పర్యటిస్తున్న సీతక్కకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు ఆమె అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం 6గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 9:15కు ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లికి చేరుకోనున్నారు. 10:15కు గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించి ములుగు జిల్లా కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1:30కి తాడ్వాయి మండలం మేడారం చేరుకుని ఆదిదేవతలైన సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించనున్నారు. 3గంటలకు మేడారంలోని అతిథి గృహంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మేడారం మహా జాతరపై సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడనున్నారు. రాత్రి ములుగుకు చేరుకొని క్యాంపు కార్యాలయంలో బస చేయనున్నారు. సోమవారం ఉదయం 8:30కు వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప దేవాలయాన్ని సందర్శించనున్నారు. అనంతరం ములుగుకు చేరుకొని ప్రభుత్వ దవాఖానలో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను ప్రారంభించనున్నారు. ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు పరికరాలను పంపిణీ చేసి 11:30కు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నారు.

## 20వ తేదీ నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 16 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఏ(లాంగ్వేజెస్)తో పాటు ఇతర డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలను ఈనెల 20 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి పీ మల్లారెడ్డి తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో డిగ్రీ పరీక్షలు జరుగుతాయన్నారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు 20, 22, 27, 29న, జనవరి 2, 4, 8, 10, 12 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మూడో సెమిస్టర్ పరీక్షలు 21, 23, 28, 30న, జనవరి 3, 5, 9, 11, 16, 18 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఐదో సెమిస్టర్ పరీక్షలను 20, 22, 27, 29న, జనవరి 2, 4, 8, 10, 12 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు.

# గిరిజన వర్సిటీ ఏర్పాటుకు వేగంగా అడుగులు

- ములుగులో సెంట్రల్ యూనివర్సిటీ అధికారుల పర్యటన
- భూములు, తరగతి గదుల పరిశీలన
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం

ములుగు, డిసెంబర్ 16 (నమస్తేతెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర విభజన హామీలో భాగమైన గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 4వ తేదీన పార్లమెంట్‌లో గిరిజన యూనివర్సిటీ బిల్లుకు ఆమోదం లభించింది. కాగా, శనివారం హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ఉప కులపతి బీజేరావు, రిజిస్ట్రార్ దేవేస్‌నిగం, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్‌కుమార్ యూనివర్సిటీకి ములుగులో కేటాయించిన ప్రభుత్వ భూములను పరిశీలించారు. అలాగే తాత్కాలికంగా తరగతులను ప్రారంభించేందుకు ములుగు మండలంలోని జాకారం వైటీసీ భవనాన్ని సందర్శించారు. కాగా, తొలుత కలెక్టర్ ఇలా త్రిపాఠి తన కార్యాలయంలో సెంట్రల్ యూనివర్సిటీ బృందానికి గిరిజన వర్సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సదుపాయాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ములుగు తహసీల్దార్ విజయ్‌భాస్కర్, ఇతర అధికారులతో కలిసి గట్టమ్మ దేవాలయం వద్ద ఉన్న భూములను సభ్యులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరంలో తరగతులను ప్రారంభించేందుకు జా కారం వైటీసీ భవనాన్ని పరిశీలించామన్నారు. వారి వెంట జాయింట్ డైరెక్టర్ కల్యాణ్‌రెడ్డి, డీటీడీవో దేశీరాం ఉన్నారు.



యూనివర్సిటీ భూముల వివరాలను బృందానికి వివరిస్తున్న పీవో, అదనపు కలెక్టర్, తహసీల్దార్

## నేటి నుంచి మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 16 : రాష్ట్ర నలుమూలల నుంచి మేడారం సందర్శనకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 17వ తేదీ నుంచి ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జే శ్రీలత తెలిపారు. హనుమకొండ నుంచి ప్రత్యేక బస్సులను ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రతి బుధవారం, ఆదివారం, ఇతర సెలవు దినాల్లో నడిపిస్తామని, ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

# స్టార్టప్‌ల అభివృద్ధిపై దృష్టి సారించాలి

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి
- భువనేశ్వర్ ఐఐఎంటీతో వరంగల్ నిట్ ఒప్పందం



భువనేశ్వర్ ఐఐఎంటీ అధికారులతో ఎంవోయూ మార్చుకుంటున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 16 : పరిశ్రమలు, సమాజ హితం, ఉద్యోగావకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా స్టార్టప్‌లను అభివృద్ధి చేయాలని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. నిట్‌లో శనివారం ఇండస్ట్రీ ఔట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని సంస్థలన్నీ సామాజిక సమస్యలను పరిష్కరించే స్టార్టప్‌లను అభివృద్ధి చేయడం ప్రారంభించాలన్నారు. భువనేశ్వర్ సీఎస్ఐఆర్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ డైరెక్టర్ రామానుజ నారాయణ్ మాట్లాడుతూ.. చాలామంది విద్యార్థులు అమెరికా వెళ్లాలని కలలు కంటున్నారని, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఇతర కంపెనీలకు భారత సంతతి వారే సీఈవోలుగా ఉన్నారని, దేశంలో ఎక్కడ లోపం ఉంది.. ఇక్కడి ఇంజినీర్లు, మేధావులు విదేశాలకు వలస వెళ్లకుండా చూడాలని పేర్కొన్నారు. దేశం ఎదుర్కొంటున్న అతిముఖ్యమైన సమస్య నిరుద్యోగం అని, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా అవకాశాలను సృష్టించడం గురించి ఆలోచించడం ప్రారంభిస్తే ఈ సమస్యను పరిష్కరించవచ్చని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ గ్లోరీ స్వరూప అన్నారు. కంపెనీలను సృష్టించే దిశగా అన్ని ఎన్‌ఐటీలు పనిచేయాలని కోరారు.

అలాగే డీఆర్‌డీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ జేఆర్ జోషి ఇతర దేశాల్లో పరిశోధనల అంశాలపై వివరించారు. మే 2023 ప్రకారం దేశంలోని 670 జిల్లాల్లో 99వేల స్టార్టప్‌లు ఉన్నాయని చెప్పారు. 'పరిశ్రమలకు సహాయపడే పరిశోధన ఆలోచనలను అభివృద్ధి చేయాలన్నారు. ఎన్‌ఐటీలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని, ప్రపంచ స్థాయి సమస్యలను పరిష్కరించడంలో పరిశ్రమల విభాగంతో సమన్వయం చేసుకుంటూ ఎన్‌ఐటీలు పనిచేయాలని సూచించారు.

### ఐఐఎంటీ-వరంగల్ నిట్ ఒప్పందం..

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ (ఐఎంఎంటీ) భువనేశ్వర్‌తో వరంగల్ నిట్ అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. పరిశోధన, కన్సల్టింగ్‌ను బలోపేతం చేయడానికి ఎంవోయూ సహాయపడుతుందని నిట్ డైరెక్టర్ తెలిపారు. ఎంఓయూ ప్రకారం రెండు సంస్థలు పరిశోధనా సౌకర్యాలను పంచుకుంటాయని, బాహ్యానిధుల కోసం ఉమ్మడి పరిశోధన ప్రతిపాదనలను అభివృద్ధి చేస్తాయన్నారు. ఈ మేరకు ఎన్‌ఐటీ వరంగల్ డైరెక్టర్, భువనేశ్వర్ సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ డైరెక్టర్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసి మార్పిడీ చేసుకున్నారు. కాగా, ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తమ విలువైన సహకారాన్ని అందించిన అన్ని ఎన్‌ఐటీలకు నిట్ డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. రెండు రోజుల పాటు జరిపిన అన్ని చర్చలను సారాంశాలను డాక్యుమెంట్ చేస్తామని చెప్పారు. ఎన్ఐటీ వరంగల్‌లో మొదటి రీసెర్చ్ కాన్‌క్లేవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్‌ఐటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ సోమశేఖర్, అసోసియేట్ డీన్‌లు ప్రొఫెసర్ వాసు, ప్రొఫెసర్ శిరీష్ సోనావానే ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.